# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేదీ : 11-08-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. ప్రకృతి విలయం కారణంగా తీవ్రంగా దెబ్బతిన్న కేరళ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు.
2. ఆంధ్రప్రదేశ్‌లో విశాఖ రైల్వే జోన్ ఏర్పా టు పనుల్లో పురోగతి ఉందని రైల్వే శాఖ మంత్రి అశ్వని వైష్ణవ్ తెలిపారు.
3. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న సమస్యల పరిష్కారానికి అవసరమైతే తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డితో మరోసారి సమావేశమవుతానని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చెప్పారు.
4. తెలంగాణలో రేషన్ కార్డుల మంజూరుకు సక్సేనా కమిటీ సిఫారసులను పరిగణనలోకి తీసుకుంటామని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు.
5. స్వాతంత్ర్య దినోత్సవాన్ని ప్రతి గ్రామంలో ఘనంగా జరుపుకొనేందుకు పంచాయతీలకు ఇస్తున్న నిధులను పెంచామని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ ప్రకటించారు.
6. రాష్ట్రంలోని జల విద్యుత్ కేంద్రాల్లో గరిష్ఠ ఉత్పత్తి సాధించేందుకు అన్ని చర్యలు చేపట్టాలని హైడ్రల్ ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్లను తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు.

============================

ప్రకృతి విలయం కారణంగా తీవ్రంగా దెబ్బతిన్న కేరళ రాష్ట్రంలోని వయనాడ్ ప్రాంతంలో పర్యటించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. నిధుల కొరత లేకుండా చూస్తామని తెలిపారు. వయనాడ్‌లో పర్యటించిన అనంతరం అక్కడి పరిస్థితిపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి విలయంలో ఎందరో అమాయకులు ప్రాణాలు కోల్పోయారని.. ఈ విపత్తు సాధారణమైనది కాదని ఆవేదన వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని, అక్కడి పరిస్థితి మెరుగు పడేందుకు కృషి చేస్తుందని నరేంద్రమోదీ పేర్కొన్నారు. అంతకు ముందు ప్రధానమంత్రి కొండచరియలు విరిగిపడిన ప్రాంతంలో ఏరియల్ సర్వే నిర్వహించారు. అక్కడి బాధితులను పరామర్శించారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లో విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు పనుల్లో పురోగతి ఉందని రైల్వే శాఖ మంత్రి అశ్వని వైష్ణవ్

తెలిపారు. ఢిల్లీలో నిన్న ఆయన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ... విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుకు నూతనంగా భూముల కేటాయింపు జరుగుతుందని, ఆంధ్రప్ర దేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో రైల్వే జోన్‌పై ఇప్పటికే చర్చించామని అన్నారు. 7 వేల 383 కోట్ల రూపాయలతో ఒడిశా, ఆంధ్రప్రదేశ్ , తెలంగాణా మీదుగా నూతన రైల్వే కారిడార్ ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. దీనిలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో 85.5 కిలోమీటర్లు, తెలంగాణాలో 19 కిలోమీటర్ల నూతన రైల్వే లైన్ నిర్మాణం జరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. తుఫాను వంటి విపత్కర పరిస్థితుల్లో ఈ లైనులో రైళ్లు నడుపుతామని, గోదావరినదిపై నూతనంగా వంతెన నిర్మిస్తామని అశ్విని వైష్ణవ్ వెల్లడించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో గడిచిన ఐదేళ్లలో జరిగిన నష్టాన్ని సరి చేయడానికి తీవ్రంగా కృషి చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో నిన్న జరిగిన తెలంగాణ ముఖ్యనేతల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. తెలంగాణలో పార్టీ బలోపేతం, సభ్యత్వాల నమోదుపై చర్చించారు. తెలంగాణ ప్రజల మనోభావాలను గౌరవిస్తానని, త్వరలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిని నియమిస్తానని తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య నెలకొన్న సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని స్పష్టంచేశారు. అవసరమైతే తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డితో మరోసారి సమావేశమవుతానని చంద్రబాబునాయుడు చెప్పారు.

---------------------------

స్వాతంత్ర్య దినోత్సవాన్ని ప్రతి గ్రామంలో ఘనంగా జరుపుకొనేందుకు పంచాయతీలకు ఇస్తున్న నిధులను పెంచామని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ ప్రకటించారు. అమరావతిలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.... ఈ వేడుకల్లో స్వాతంత్ర్య సమరయోధులను, దేశానికి సేవలందించిన సైనికులను, పారిశుధ్య కార్మికులను సత్కరించాలని సర్పంచులకు విజ్ఞప్తి చేశారు. విద్యార్థులకు జెండా పండుగ విశిష్టత తెలిసేలా వ్యాస రచన, క్విజ్, చిత్రలేఖనం, ఉపన్యాస, క్రీడా పోటీలు నిర్వహించి వారికి బహుమతులు అందజేయాలని సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాల నిర్వహణకు 34 సంవత్సరాల క్రితం ఇచ్చిన జీవో స్థానంలో నిధులు పెంచుతూ... నూతన జీవోను జారీచేశామని పవన్ కళ్యాణ్ వివరించారు.

---------------------------

రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 16వ తేదీ నుంచి సెప్టెంబరు 30వ తేదీ వరకు రెవెన్యూ సదస్సుల నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. సదస్సుల్లో అందిన ఫిర్యాదులపై చర్యలు తీసుకునేందుకు అధికారులకు మరో 45 రోజుల గడువు ఇచ్చింది. నవంబరు 15వ తేదీలోగా ఫిర్యాదుల స్వీకరణ, చర్యల ప్రక్రియ పూర్తికానుంది. భూముల వ్యవహారాలతో సంబంధమున్న అటవీ, దేవదాయ, వక్ఫ్, ఇతర శాఖల అధికారులు కూడా ప్రజల వద్దకు వెళ్లనున్నారు. ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదుచేసి పరిష్కారం చూపుతామని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ నిన్న ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సుల నిర్వహణ కోసం ప్రత్యేకంగా జిల్లాలకు సీనియర్ ఐఏఎస్ అధికారులను నోడల్ అధికారులుగా నియమిస్తున్నామని రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా ఒక ఉత్తర్వులో పేర్కొన్నారు.

---------------------------

తెలంగాణలో తెల్లరేషన్ కార్డుల పంపిణీకి విధివిధానాలపై మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహా, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కూడిన మంత్రివర్గ ఉపసంఘం నిన్న హైదరాబాద్‌లో సమావేశమై

చర్చించింది. గ్రామీణ ప్రాంతాల్లో లక్ష రూపాయల వార్షిక ఆదాయం లేదా మూడున్నర ఎకరాల మాగాణి, లేదా ఏడున్నర ఎకరాల లోపు  చెలక భూమి ఉన్నవారినే తెల్ల రేషన్ కార్డుల కోసం ఎంపిక చేయాలని మంత్రులు ప్రతిపాదించారు. పట్టణ ప్రాంతాల్లో 2 లక్షల గరిష్ట వార్షికాదాయం ఉన్న వారినే అర్హులుగా నిర్ణయించాలని సూచించారు. అన్ని పార్టీలు, ప్రజాప్రతినిధుల సలహాలు తీసుకోవాలని ఉపసంఘం నిర్ణయించింది. సమావేశం అనంతరం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ..  సక్సేనా కమిటీ సిఫారసులను రేషన్ కార్డుల మంజూరుకు పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు.

---------------------------

వర్షాలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్రంలోని జల విద్యుత్ కేంద్రాల్లో గరిష్ఠ ఉత్పత్తి సాధించేందుకు అన్ని చర్యలు చేపట్టాలని హైడల్ ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్లను తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి  విక్రమార్క ఆదేశించారు. హైదరాబాద్ ప్రజాభవన్‌లో థర్మల్, హైడల్ విద్యుత్తు ఉత్పాదనకు సంబంధించి ఆ శాఖల సీఈలతో నిన్న ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. థర్మల్ పవర్ ప్రాజెక్టులకు సంబంధించి ప్రతి ప్లాంట్‌లో కనీసం 17 రోజుల విద్యుత్ ఉత్పాదనకు సరిపడా బొగ్గు నిల్వలు ఉండాలని స్పష్టంచేశారు. విద్యుత్ శాఖ అంటేనే 24గంటలూ పనిచేసే అత్యవసర శాఖ అని, పూర్తిగా సేవా దృక్పథంతో కూడిన బాధ్యతల్లో ఉన్నామని అన్ని స్థాయిల్లోని అధికారులు, సిబ్బంది గుర్తు పెట్టుకోవాలని భట్టి విక్రమార్క సూచించారు.

---------------------------

తెలంగాణలో రుణమాఫీ విషయంలో ఏవైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే సంబంధిత అధికారులను సంప్రదించాలని వెనుకబడిన వర్గాల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రైతులకు విజ్ఞప్తి చేశారు. సిద్దిపేట జిల్లా అక్కన్నపేటలో రైతు వేదికల్లో వ్యవసాయ పథకాలపై నిన్న నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సమీపంలోని గౌరవెల్లి ప్రాజెక్ట్ కాలువల నిర్మాణానికి 431 కోట్ల రూపాయలు విడుదలయ్యాయని తెలిపారు. ఇప్పటి వరకు లక్షా 50 వేల రూపాయల లోపు రుణమాఫీ జరిగిందన్న ఆయన.. మరో వారంలో 2 లక్షల రూపాయల వరకు రుణమాఫీ జరుగుతుందని వెల్లడించారు.

---------------------------

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 15వ తేదీ నుంచి 17వ తేదీ వరకు పవిత్రోత్సవాలు జరుగనున్నాయి. 14వ తేదీన అంకురార్పణతో ఈ ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడు రోజుల పాటు సాయంకాలం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి ఆలయ మాడవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిస్తారు. ఈ నెల 14వ తేదీన పవిత్రోత్సవాలకు అంకురార్పణ సందర్భంగా సహస్రదీపాలంకార సేవను తిరుమల తిరుపతి దేవస్థానం రద్దు చేసింది. 15వ తేదీన తిరుప్పావడ సేవ, 15 నుంచి 17వ తేదీ వరకు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను  రద్దు చేసింది. 18వ తేదీ కూడా కల్యాణోత్సవాన్ని రద్దు చేశారు.

---------------------------

నాగార్జునసాగర్ ప్రాజెక్టు 26 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. ఎగువ నుంచి మొత్తం 4 లక్షల 14 వేల 128 క్యూసెక్కుల నీరు వస్తుండగా, అధికారులు నిన్న 16 క్రస్ట్‌గేట్లను 10 అడుగులు, 10 గేట్లను

5 అడుగుల మేర ఎత్తి 3 లక్షల 12 వేల 756 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. నాగార్జున సాగర్ జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం 588 అడుగులు ఉంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా ప్రాంతంలో నిన్న ఉదయం నుంచి ఎక్కువ చోట్ల ఎండ తీవ్రత, ఉక్కపోత కొనసాగాయి. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. ప్రకాశం జిల్లా ఒంగోలులో 38 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అయితే ఎండ వల్ల వాతావరణ అనిశ్చితి నెలకొని మధ్యాహ్నం నుంచి పలుచోట్ల వర్షాలు కురిశాయి. రాబోయే 24 గంటల్లో ఉత్తరకోస్తాలో పలుచోట్ల, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.

======================